



**ఉప్పొంగిన అభిమానం.. జననేత పరవశం**

- అడుగడుగునా ఘన స్వాగతాలు
- పూలు, మంగళ హారతులతో ఎదుర్కోలు
- హోరెత్తిన జై కేసీఆర్, జై తెలంగాణ నినాదాలు
- బస్సుయాత్ర వెంట కదిలొచ్చిన జనాలు
- కరచాలనం చేసి సెల్ఫీలు దిగి సంబురాలు
- ఇవీ 'వరంగల్-ఖమ్మం దారి'లో కనిపించిన దృశ్యాలు
- జననేత కేసీఆర్‌ను చూసి ఉప్పొంగిన అభిమానుల గుండెలు

కేసీఆర్ ఖమ్మం రోడ్‌షోకు వెళ్తుండగా తొర్రూరులో భారీగా తరలివచ్చి స్వాగతం పలుకుతున్న ప్రజలు

**బాధపడొద్దు.. మనకు మంచిరోజులొస్తాయ్**



# పలుకరిస్తూ ముందుకు సాగుతూ..

## మానుకోట జిల్లా మీదుగా ఖమ్మం రోడ్‌షోకు వెళ్లిన కేసీఆర్

## తొర్రూరు, మరిపెడ వద్ద కొద్దిసేపు ఆగిన బీఆర్‌ఎస్ అధినేత

**అభిమాన నేతను చూసేందుకు కదిలివచ్చిన జనం**

- సెల్ఫీలు, ఫొటోలు, కరచాలనాలతో మురిసిన చిన్నాపెద్దా..
- యోగక్షేమాలు తెలుసుకొని ఓపిగ్గా విన్న కేసీఆర్
- సాగు, తాగునీటికి గోస పడుతున్నామన్న రైతులు, మహిళలు
- మంచిరోజులు వస్తాయ్.. బీఆర్‌ఎస్‌కు ఓటేసి వారికి బుద్ధి చెప్పండని పిలుపు

ఎల్లంపేట స్టేజీ వద్ద హోటల్‌లో టీ బ్రేక్

మిర్చీలు తిని, చాయ్ తాగి ప్రజలతో మమేకం

- వెంట వచ్చిన ఎర్రబెల్లి, స్థానిక నాయకులు
- బస్సుయాత్రకు ఎదురేగి స్వాగతం పలికిన ప్రజలు
- అభివాదం చేస్తూ ధన్యవాదాలు తెలిపిన జననేత
- కేసీఆర్ రాకతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో సంబురం
- బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ నుంచి ఖమ్మం బయల్దేరిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మార్గమధ్యంలో ప్రజలను పలుకరిస్తూ వారి కష్టసుఖాలు తెలుసుకొంటూ ముందుకుసాగారు. ఆదివారం హనుమకొండ చౌరస్తాలో రోడ్‌షో ముగించుకొని రాత్రి మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇంట్లో బస చేసిన ఆయన సోమవారం సాయంత్రం హనుమకొండ, వర్ధన్నపేట, రాయపర్తి, ఐనవోలు మీదుగా మహబూబాబాద్ జిల్లాకు చేరుకొని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి తొర్రూరు, మరిపెడ మండలకేంద్రాల్లో కొద్దిసేపు ఆగారు. అప్పటికే అక్కడికి చేరుకున్న నాయకులు, ప్రజలు, అభిమానులు అభిమాన నేతకు ఎదురేగి పూలు, రంగు కాగితాలు చల్లుతూ మంగళహారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. బస్సు వెంట నడుస్తూ జై కేసీఆర్ అంటూ నినదించగా కేసీఆర్ వారికి అభివాదం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎల్లంపేట స్టేజీలోని సయ్యద్ సోంద్ హోటల్ వద్ద ఆగి పకోడీలు, మిర్చీలు తిని, చాయ్ తాగిన కేసీఆర్.. యజమానితో ముచ్చటించారు. అలాగే, అక్కడికి వచ్చిన ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. 'మీరు లేకుంటే ఆగమైంది సారు.. తాగు, సాగు నీటికి గోసపడుతున్నా'మని గోడు వెల్లబోసుకున్నారు. వారి సమస్యలను ఓపిగ్గా విన్న కేసీఆర్ మనకు మంచిరోజులొస్తాయ్.. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి వారికి బుద్ధి చెప్పాలని కోరుతూ ఖమ్మం వైపు కదిలారు.

– పెద్దవంగర(తొర్రూరు)/నర్సింహులపేట/మరిపెడ

### జననేతకు ఘన స్వాగతం

పెద్దవంగర(తొర్రూరు)/నర్సింహులపేట/మరిపెడ, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం జిల్లాకు వెళ్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర సోమవారం సాయంత్రం తొర్రూరు చేరగా జనం, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పాలకేంద్రం నుంచి బస్టాండ్ చౌరస్తా వద్ద వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై పెద్దఎత్తున కేసీఆర్ బస్సులో నుంచే కేసీఆర్ ప్రజలు, పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. జై తెలంగాణ.. జై జై తెలంగాణ.. అమర వీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. రోడ్ షోకు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికీ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్ కారు గుర్తుకే ఓటు వేయాలని నినాదాలు చేశారు. అనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్థానిక నాయకులను కేసీఆర్‌కు పరిచయం చేశారు.



హనుమకొండ నుంచి ఖమ్మం వెళ్తున్న కేసీఆర్‌కు అభివాదం చేస్తున్న అభిమానులు

### మీరు లేక ఆగమైంది సారు..

**- గుగులోత్ జ్యోతి, రైతు, ఎల్లంపేట**

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సులో ఖమ్మం వెళ్తున్న కేసీఆర్ మరిపెడ మండలంలోని ఎల్లంపేట స్టేజీ వద్ద హోటల్‌లో టీ తాగి వెళ్తున్న క్రమంలో రైతు గుగులోత్ జ్యోతి తన సమస్యలను చెప్పుకొంది.

గుగులోత్ జ్యోతి : సార్ నమస్కారం

కేసీఆర్ : నమస్కారం చెప్పమ్మా

జ్యోతి : నా పొలం పట్టా కాలేదుసార్

కేసీఆర్ : ఎన్ని ఎకరాలు?

జ్యోతి : మూడు ఎకరాలు సార్. యాసంగి రెండు ఎకరాలు వరి పొలం సాగు చేస్తే నీళ్లు రాక ఎకరం ఎండిపోయింది సార్.

కేసీఆర్ : ఎస్సారెస్పీ ద్వారా కాల్వలో నీరు రాలేదా?

జ్యోతి : వారం తప్ప వారం నీళ్లు వదిలినారు సార్. మార్చి మధ్యనే నీళ్లు ఆపడంతో ఎకరం ఎండిపోయింది సార్

కేసీఆర్ : మంచి రోజులు వస్తాయి. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసి వాళ్లకు బుద్ధి చెప్పాలి.

జ్యోతి : పట్టా కాకపోవడానికి కారణంపై ఫోన్ నంబర్ తీసుకున్నారు. తర్వాత సార్ పీఏ భూమికి సంబంధించిన వివరాలు తీసుకున్నారు.



ఎల్లంపేట హోటల్‌లో కేసీఆర్‌తో సెల్ఫీ తీసుకుంటున్న ఓ అభిమాని



కేసీఆర్ కోసం చాయ్ చేస్తున్న హోటల్ యజమాని సయ్యద్ సోంద్

### హోటల్ ఎలా నడుస్తోంది..

బస్సుయాత్ర మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ వద్ద సయ్యద్ సోంద్ హోటల్ వద్ద ఆగింది. బస్సు నుంచి దిగిన కేసీఆర్ యజమాని సయ్యద్ సోంద్‌తో మాట్లాడారు. పిల్లలు ఎంతమంది?, ఏం చదువుతున్నారు? హోటల్‌తో ఉపాధి ఎలా గడుస్తుంది? అని అడిగి తెలుసుకున్నారు. గారెలు, పకోడీలు, బజ్జీలు తిని టీ తాగి.. సాయబ్ రుచిగా ఉన్నాయంటూ కితాబిచ్చారు. హోటల్ వద్ద ఆగిన కేసీఆర్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున జనం చేరుకున్నారు. కొందరు చిన్నారులు, యువతులు కేసీఆర్‌తో కరచాలనం చేశారు. అనంతరం అక్కడ ఉన్న జనంతో మమేకమై వారితో ఆప్యాయంగా మాట్లాడారు. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.

### మా హోటల్‌కు రావడం అదృష్టం

నర్సింహులపేట, ఏప్రిల్ 29: కేసీఆర్ సార్ మా హోటల్ దగ్గర ఆగడం మస్తు సంతోషంగా ఉంది. మా హోటల్‌లో గారెలు, బజ్జీలు, పకోడీలు తిన్నారు. టీ చేయమని అడిగారు. ఇక్కడ పొజిషన్ ఎలా ఉంది అని అడిగారు. 20 మందికి టీ చేసి పోసిన. మీరు సీఎంగా ఉన్నప్పుడు 24గంటలు నీళ్లు వచ్చేది. ఇప్పుడు ఒకరోజు తప్ప ఒకరోజు వస్తుంది. బాగ తిప్పలయితాంది అని చెప్పిన. మీరు సీఎంగా లేనందుకు బాధనిపిస్తుంది అని చెప్పిన. హోటల్ గిరాకీ ఎంత వస్తుంది అని అడిగారు. రూ. 4000 వస్తుందని చెప్పాను. పిల్లలు ఎంత మంది, ఏం చదువుతున్నారు అని అడిగారు. ఇద్దరు పిల్లలు సార్ అని చెప్పిన. ఇంటర్ చదువుతున్నారని చెప్పిన.. పాసయ్యారా అని అడిగారు. ఇద్దరు పాసైనారు అని చెప్పిన. కంగ్రాట్స్ చెప్పారు. సార్ వెళ్తున్న సమయంలో రూ. 500 ఇచ్చారు. వద్దు సారు మీరు మా హోటల్‌కు రావడమే అదృష్టం అని చెప్పినా పర్వాలేదు ఉంచుకోండి అని ఇచ్చారు. రూ. 500 సార్ గుర్తుగా దాచుకుంటున్నా.

– సయ్యద్ సోంద్, హోటల్ యజమాని, ఎల్లంపేట



### 'కాంగ్రెస్'తో మార్పు వచ్చిందా?

కాంగ్రెస్ పాలనలో మార్పు వచ్చిందా?, ఎస్సారెస్పీ నుంచి సాగు నీరు వస్తుందా?, రైతుబంధు వచ్చిందా?, రుణమాఫీ అయిందా? పంటకు మద్దతు ధర ఉందా? బోనస్ ఇచ్చారా? అని ప్రజలను అడుగగా, వారు ఏమీ లేదు సార్.. సాగునీళ్లు లేవు, రైతుబంధు రాలేదు, రుణమాఫీ కాలేదు., బోనస్ రూ.500 ఇవ్వలేదని రైతు గుగులోత్ రెడ్డితోపాటు అక్కడే ఉన్న కొండ్లె శ్రీనివాస్ కేసీఆర్‌కు వివరించారు.



తొర్రూరులో జై తెలంగాణ నినాదం చేస్తున్న కేసీఆర్

### హారతి పట్టి, స్వాగతం పలికిన ఎంపీ కవిత

కేసీఆర్ బస్సుయాత్ర మరిపెడ మున్సిపల్ కేంద్రానికి చేరుకోగానే ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తమ అభిమాన నేతకు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పూలుచల్లి ఘనస్వాగతం పలికారు. బీఆర్‌ఎస్ మానుకోట పార్లమెంట్ అభ్యర్థి, జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోత్ కవిత కేసీఆర్‌కు మంగళహారతితో స్వాగతం పలికారు. దిష్టిగుమ్మడి కొట్టారు. కాగా, జననేతను చూసేందుకు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి పొడవునా సుమారు రెండు కిలోమీటర్ల మేర జనం బారులు తీరారు. తమ అభిమాన నేతను చూసి మురిసిపోయారు. అధినేత రాకతో బీఆర్‌ఎస్ శ్రేణులు ఉప్పొంగిపోయారు.





మాజీ మంత్రి కెప్టెన్ నివాసం నుంచి ఖమ్మం బయలుదేరిన కేసీఆర్

### హనుమకొండ నుంచి ఖమ్మం రోడ్‌షోకు..

హనుమకొండ, ఏప్రిల్ 29 : హనుమకొండ హంటర్‌రోడ్డులోని మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు నివాసంలో ఆదివారం రాత్రి బస చేసిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం సాయంత్రం 4.40 గంటలకు ఖమ్మం బయల్దేరారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు ఆయనను కలిశారు. బస్సుయాత్రలో ఖమ్మం వెళ్తున్న కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు, అభిమానులు జైకొట్టగా, వారికి అభివాదం చేస్తూ ముందుకుసాగారు.





తనను చూసేందుకు వచ్చిన అభిమానులకు పకోడీలు అందజేస్తున్న కేసీఆర్

### అమ్మా మీకు రూ.2500, తులం బంగారం ఇచ్చారా?

కల్యాణలక్ష్మి వస్తుందా?, తులం బంగారం ఇచ్చారా?, మహిళలకు రూ.2500 ఇచ్చారా? పింఛన్ రూ.4000 వస్తుందా అని మహిళలను అడుగగా, ఏమి లేదుసార్ అని వారు బదులిచ్చారు. 'మీరు లేక అంతా ఆగమైపోయింది సార్. మాయ మాటలు నమ్మి మోసపోయినం, ఇట్లయితది అనుకోలే. మళ్లీ మీరే రావాలె సారు. ఎండాకాలంల తాగు, సాగునీరు లేక ఇబ్బందిపడుతున్నాం' అంటూ కేసీఆర్‌కు గోస చెప్పుకున్నారు.

# లోక్‌సభ బరిలో వీరే..

## వరంగల్‌లో 42, మహబూబాబాద్‌లో 23 మంది

### రెండు స్థానాల్లో ఎనిమిది నామినేషన్ల ఉపసంహరణ

వరంగల్, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ)/మహబూబాబాద్ రూరల్: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో ఆరుగురు, మహబూబాబాద్‌లో ఇద్దరు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. వీరిలో వరంగల్‌లో స్వతంత్ర అభ్యర్థులు ఇసంపల్లి వేణు, మార్త రాజభద్రయ్య, కుమ్మరి కన్నయ్య, ఇల్లందుల శోభన్‌బాబు, వడ్డెపల్లి విజయ్‌కుమార్, బర్ల బాబు, మహబూబాబాద్‌లో ఇద్దరు ఇండిపెండెంట్లు ఉన్నారు. పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని ఈ నెల 18 నుంచి 25 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మొత్తం 58 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో పది మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురి కాగా, సోమవారం ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి 42 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో బీఆర్‌ఎస్ నుంచి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్, బీజేపీ నుంచి అరూరి రమేశ్, కాంగ్రెస్ నుంచి కడియం కావ్య ఉన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మొత్తం 30 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో ఐదుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే. ఉపసంహరణ ముగిసిన అనంతరం 23 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇందులో బీఆర్‌ఎస్ నుంచి మాలోత్ కవిత, కాంగ్రెస్ పోరిక బలరాంనాయక్, బీజేపీ నుంచి అజ్మీరా సీతారాంనాయక్ ఉన్నారు. మే 13న పోలింగ్ జరుగనుంది.